# శైలజ

వర్షం ఇంకా పెరుగుతున్నది.

వానపాముల్లాంటి జలధారలు,తాచుపాములై క్రమంగా కొండచిలువలుగా మారుతున్నాయి.

నేను బయలుదేరిన వేళ బాగాలేదు.

లేకపోతే ఊరుదాటి రెండుమైళ్ళు రాగానే ఈ వర్ష మేమిటి?

అటు రెండుమైళ్లు, ఇటు రెండుమైళ్ళు, మధ్యలో చిక్కు పడిపోయాను.

ఉరుములు మెరుపులు. అలాగే ఆ మంచెకింద నిలబడ్డాను.

ఇంకో గంటసేపటికి వర్షం తగ్గుముఖం పట్టింది.

బ్రతుకుజీవుడా అని నడక సాగించాను.

వానకు రోడ్డు బాగా చితికిపోయింది. అడుగులు ఇదివరకటిలాగ వేగంగా పడటంలేదు.

బురద చిందులకు గుడ్డలు చెడిపోయాయి.

క్రమంగా చీకటిరేఖలు వ్యాపించేటట్లు తోస్తున్నది.

నేను నడకవేగం పెంచాను.

పట్నం కనుచూపుమేరలో కనపడుతున్నది.

దూరాన నా ఆశలవలె మెరుస్తున్న ఆ దీపాలను చూస్తూ చకచకా నడుస్తున్నాను.

జల జల, ఏదో శబ్దం.

దగ్గిరికి వెళ్ళిచూచాను.

కాలువ పొంగింది.

అటు ఒక లారీ, ఇటు రెండుఎడ్ల బండ్లు నిలబడిపోయాయి.

లారీవాడు తిరిగి వెనకకు పోయే ప్రయత్నంలో ఉన్నాడు.

బండివాణ్ణి ప్రశ్నించాను.

"తగ్గదు బాబూ, ఇప్పుడిప్పుడే, రాత్రి నీ పొద్దుకో మరి."

'హతోస్మి" అనుకున్నాను.

కాలువ దాటితే సరిగ్గా ఇరవై నిమిషాల ప్రయాణం. ఏం చేయను?
చుట్టూ చూచాను. దూరంగా ఒకతోట. అందులో దీపాలు.
బాగా చీకటి పడిపోయింది అప్పుడే.
చీకటిని చీల్చుకుంటూ మెల్లిగా తోటవైపు నడిచాను.
కాపలాకుక్క బౌ బౌ మంది.
బెదిరిపోయాను.

"ఎస్, కమిన్!" ఉరిమినట్లుగా ఉందా పిలుపు. భయంగా లోనికి ప్రవేశించాను. కుక్క, గొలుసులతో కట్టివేయ బడిఉంది.

"ఎవరా మనిషి?" పని చేసేవాడు కాబోలు, మొరటుగా ఉందా కేక.
"లోనికి రానియ్యి, రాజయ్యా అతణ్ణి" మళ్ళీ ఉరుము.
"చిత్తం బాబూ" భయంతో లొంగిపోయాడు పనిమనిషి.
చుట్టూ తోట మధ్యలో భవనం లోపల మెర్క్యూరీ దీపాలు వెలుగుతున్నాయి.

వాతావరణం విచిత్రంగా ఉంది.
దూరాన కప్పల బెకబెకలు.
"పైకి రండి!" మేడమీదినుండి పిలుపు-యజమాని కాబోలు.
పక్కనే ఉన్న మెట్లుగుండా పైకి నడిచాను.

హాలులో స్తంభానికి ఆనుకొని వానలో తడిసిన ప్రకృతిని చూస్తున్నాడు ఆయన.

మనిషి పెద్ద అందంగా లేకపోయినా ఆదోరకమైన ఆకర్షణ ఉంది.
పదహారణాల ఆంధ్రుడే అయినా బెంగాలీ పంచెకట్టు కట్టాడు.
ఉలెన్ స్వెట్టర్.
బంగారు గొలుసు గడియారం. రాత్రి కూడా మెరిసే ఉంగరం- వెలుగుతున్న సిగరెట్.
"రండి." ప్రేమగా పిలిచాడు.
దగ్గిరగా వెళ్ళాను.
కూర్చోండి." అప్యాయంగా కుర్చీ చూపించాడు.
"నర్స్!" పెద్దగా కేక వేశాడు.
లోపలినుండి మెరుపు తీగె వచ్చింది.

"చూడు-ఈయన ఎవరో వానలో తడిశాడు-మన అతిథి. పొడిగుడ్డలు చూపించు ఫ్రెండ్! ఈమె వెంట వెళ్ళండి."

నేను ఆశ్చర్యపోయాను అనుకోని ఈ ఆదరణకు.

భూలోకంలో దేవతలు ఉన్నారనే నేను విశ్వసించాను.

నిశ్శబ్దంగా ఆమె వెనకనే వెళ్ళాను.

ఆమె నాకు గుడ్డలు మార్చుకునే గది చూపించింది.

పక్కనే బాత్‌రూం-బాయిలర్ మరుగుతూంది. వేడినీళ్ళతో ముఖం కాళ్ళు చేతులూ కడుక్కొని, పొడిగుడ్డలు కట్టుకున్నాను.

గదినుండి ఇవతలకి వచ్చేసరికి ఆమె నాకోసమే నిలబడి ఉంది.

ఏమిటని కళ్ళతో ప్రశ్నించాను.

"మీకు పెదబాబు పరిచయమా?" అంది.

"లేదు."

"మరెందుకు వచ్చారు?"

వింతగా ఉంది ఈ ప్రశ్న.

"చూడండి. మీరెవరో నాకు తెలియదు. ఈ మేడ ఎవరిదో కూడా నాకు తెలియదు. పక్కనే ఉన్న పల్లెటూరులో మా కౌలుదారుతో మాట్లాడదామని మధ్యాహ్నం పట్నంనుండి బయలుదేరాను. ఈ రాత్రికే తిరిగి రైలుమీద హైదరాబాదు వెళదామని నా సంకల్పం. కాని కాలువ అడ్డం వచ్చి ఆగిపోయాను ఎలాగా అని ఆలోచిస్తూ ఇటు వచ్చాను. బాబుగారు 'రండి అని పిలిచారు-అంతే!' అన్నాను.

"మీ పేరు?"

"రమణరావు. మీ పేరు?"

ఆమె పేరు చెప్పడానికి ఇష్టపడనట్లున్నది. మౌనంగా ఊరుకున్నది. కొంచెం ఆగి "రమతో మీకు పరిచయం ఉందా?"

"నేనా పేరే వినలేదు."

"అయితేసరే! మీ రిక బాబుగారితో కాలక్షేపం చెయ్యండి" అని వదిలి పెట్టింది.

ఈ ప్రశ్నలూ ఈ వ్యవహారం చూచి ఇదేదో డిటెక్టివ్ కథల్లే ఉందే అని భయపడ్డాను. ఖర్మకాలి నేనేదైనా దెయ్యాలకొంపలోకి రాలేదు కదా!

అయినా నాకు దయ్యాలంటే నమ్మకంలేదు

పైగా దేవతలాంటి పెదబాబు ఉన్న ఇల్లు దయ్యాలకొంపా?

'ఏమిటి ఆలోచిస్తున్నారు?" పెదబాబు ప్రశ్నించారు.

అప్పుడే నేను హాలు లోపలికి వచ్చానన్నమాట.

"ఏమీలేదు" అన్నాను ముక్తసరిగా.

"కూర్చోండి" అన్నారు పెదబాబు. టేబిల్ మీద వేడివేడి కాఫీ కప్పులు రెండు ఉన్నాయి.

కృతజ్ఞత వ్యక్తం చేసి ఒక కప్పు తీసుకున్నాను.

"మీ పేరేమిటి?"

"రమణారావు" అన్నాను.

"ఎక్కడికి వెళుతున్నారు?"

వివరాలు చెప్పాను.

"హైదరాబాదులో ఏం చేస్తున్నారు?"

"కాలేజీలో ఉద్యోగం."

లోపల ఏదో శబ్దమైంది.

పెదబాబు చిరునవ్వు నవ్వారు.

"ఏమిటి?" ప్రశ్నించాను.

"శైలజ ఆడుకుంటున్నట్లుంది" అన్నారు.

"శైలజ ఎవరు?"

"మా అమ్మాయి." పెదబాబు కళ్ళు ఆనందంతో మెరిశాయి.

"చాలా బాగుందండి పేరు, శైలజ!' అన్నాను.

పెదబాబు నవ్వి "ఈ పేరు ఎవరి సెలక్షన్ అనుకున్నారు? మా ఆవిడ స్వయంగా చెప్పింది పాపకు శైలజ అని పేరు పెట్టాలని. ఆఁ-కాఫీ తాగండి. తరవాత మాట్లాడుదాము" అన్నారు.

కాఫీ తాగుతూ ఆలోచించసాగాను.

ఆమె పెదబాబు భార్యా?

అయితే 'నర్స్" అని పిలిచారేమిటి?

లోపల మళ్ళీ శబ్దమయింది.

"నర్స్!" పెదబాబు కేకవేశారు.

ఆమె పరిగెత్తుకుంటూ వచ్చింది.

"ఏమిటి చేస్తున్నావు?"

"ఏదో పనిమీద ఉన్నాను పెదబాబూ"

"నాన్సెన్స్-లోపల శైలజ గోల చేస్తున్నట్లుంది ఫో! ఇంకా నిద్రపోతా రెందుకని?"

"ఏమో పెదబాబూ."

"వాళ్ళమ్మ ఏం చేస్తున్నది?"

"నిద్రపోతున్నారు."

"నిద్ర, నిద్ర, మొద్దునిద్ర! పిల్లలను ఆడించడం కూడా చేతకాదు. అలాంటప్పుడు అసలు కనడం ఎందుకో? ఛీ!" పెదబాబూ ముఖం కోపంతో విచిత్రంగా మారింది.

"రమా!" గట్టిగా కేకవేశారు పెదబాబు.

లోపలినుండి జవాబు రాలేదు.

"రమను ఇటు పిలుచుకురా!"

నర్స్ కదలలేదు.

పెదబాబు ఒక్కక్షణం ఆగి "అక్కర్లేదులే-ఫో! నీ పని నీవు చూసుకో! ఈ రాత్రికి ఈ పెద్దమనిషీ, నేనూ కలిసి భోంచేస్తాము తెలుసా?"

"ఆc-"

"మరి ఏర్పాట్లు చెయ్యి."

నర్స్ వెళ్ళింది.

అప్పుడు అర్థమయింది. పెదబాబు భార్య పేరు రమ. కూతురు శైలజ. ఈ అందమైన పిల్ల కేవలం నర్స్ అన్నమాట!

రమ అనారోగ్యపు మనిషా?

మరి నర్స్ ఎందుకు?

అయినా ఈ ప్రశ్నలకు సమాధానం వెతకవలసినంత అవసరం నాకు కనిపించలేదు.

చుట్టూ చూచాను. ఆకాశం ఇంకా ఉరుముతూ ఉంది.

అంతా గాఢాంధకారం.

కప్పల కీచురాళ్ళ బెకబెకలు.

అదృష్టవంతుణ్ణి నేను, లేకుంటే ఈ రాత్రి నా గతి ?

"ఇదిగో తీసుకోండి " సిగరెట్ అందించారు. వద్దన్నాను థాంక్స్ చెపుతూ.

"చూడండి రమణరావుగారూ! మీరు హైదరాబాదులో ఎక్కడ ఉంటారు?'

'యూనివర్సిటీ వద్ద.'

''వెరీగుడ్-అక్కడికి విద్యానగర్ దగ్గిరే కదా!''

"ఔనండీ. కొద్ది ఫర్లాంగులు."

"ఓహో, ఓహో...." పెదబాబు చాలా ఆనందపడిపోతున్నారు. అకస్మాత్తుగా లేచి బీరువా దగ్గిరికి వెళ్ళి తాళాలు తీసి ఏవో కాగితాలూ, పుస్తకాలూ తీసుకొని వచ్చారు. ఒక పుస్తకం నా చేతికి ఇచ్చాడు.

"ఇదేమిటో తెలుసా?" పెదబాబు అన్నారు.

"తెలియదు-కాని తెలుసుకోనబోతున్నాను కదా!"

"ఔను' అని చిరునవ్వు నవ్వి ''చూడండి' అన్నారు.

పుటలు తిప్పాను.

అది ఒక ఆల్బమ్.

లోపల చాలా ఫోటోలున్నాయి.

పెదబాబు ఎవరో ఒక అందమైన స్త్రీ తో ఉన్న ఫోటోలు అవి.

ఆమె నర్స్ కాదు, మరెవరో!

'వీరు........అమ్మగారనుకుంటాను' అన్నాను మర్యాదగా.

'ఎగ్జాక్ట్‌లీ - ఆమె మా రమ'-

రమ అందంగానే ఉంది - సన్నగా పొడుగ్గా ఉంది. కోలముఖం. చేతికి ఒకగాజు. మరోచేతికి వాచి. కంటికి అద్దాలు. నుదురుపైన పడే శిరోజాలు. చిత్రాన్నిబట్టే చెప్పవచ్చు చాలా చలాకీపిల్ల అని. ఇరువురూ కలిసి వివిధ సుందర ప్రదేశాలలో నిలబడి ఉన్నప్పుడు తీసిన చిత్రాలు ఉన్నాయి.

పాపం ఇటువంటి రమకు అనారోగ్యమా?

నా మనస్సు బాధపడింది.

అయినా, రమకు అనారోగ్యమని ఎవరు చెప్పారు?

కేవలం నా ఊహే కదా?

పుటలు తిప్పాను. ఆల్బమ్‌లో శైలజ బొమ్మమాత్రం లేదు.

'శైలజ బొమ్మలేదేం?' అన్నాను.

'ఔను, తీయలేదు ఫోటో!' అని ఒక్క క్షణం ఆలోచించి 'నర్స్' అని కేక వేశారు.

లోపలినుండి అందమైన పిల్ల వచ్చింది.

"రేపు ఫోటోగ్రాఫర్‌ని పిలిపించు."

'అలాగే.'

'ఎందుకో తెలుసా?'

'తెలియదు.'

'మొద్దూ, మరి ఫోటోగ్రాఫర్‌ను పిలిపించు అనగానే 'ఊఁ' అని గంగి రెద్దులా తల ఊపడమేనా? ఎందుకో ప్రశ్నించనక్కరలేదా?' అని నావైపు తిరిగి 'రమణరావు గారూ, ఇట్లాంటి మనుషులతో నేనీ ఇంట్లో ఇక అవస్థ పడలేనండీ' అని విసుక్కొన్నారు.

కొంచెం ఆగి 'రేపు శైలజను రెండు మూడు ఫోజులలో ఫోటోలు తీయిద్దాము. మంచి ఎక్స్‌పర్ట్ కెమెరామన్‌ను పిలిపించు' అన్నారు.

'అలాగే' అని నర్స్ లోనికి వెళ్ళిపోయింది.

ఆల్బమ్ చూడటం ముగించి తల పైకెత్తేసరికల్లా పెదబాబు టేబిలుపై ఒక బ్లూ ప్రింట్ పరిచారు.

ఒక మేడకోసం వేసిన ప్లాన్ అది.

'బాగుందండీ' అన్నాను.

'ఔను! చాలా శ్రద్ధతో వేయించాను - ఈ డిజైన్‌లో ఇల్లు కట్టించాలి' అన్నాడు.

'ఎక్కడ?'

'విద్యానగర్‌లో. ఎలా వున్నాయి ఇళ్ళస్థలాలు?'

'చాలా ఖరీదేనండీ అయినా తమకు అక్కడ కట్టాలని సంకల్పం కలిగిందేమిటి?'

'రమ కట్టమన్నదయ్యా రమ! నర్స్!' అని మళ్ళీ కేకవేశారు. నర్స్ వచ్చింది.

'రమ ఏం చేస్తున్నది?'

'ఇంకా నిద్ర లేవలేదండి.'

'టైమయింది, లేపి మందు ఇవ్వకూడదూ?'

'అలాగే.'

'అలాగే ఏమిటి? ఫో' అని 'నేనూ వస్తానుండు' అని లేచారు.

'అక్కర్లేదు బాబుగారూ. మీరు కూర్చొని మాట్లాడుతూఉండండి' అని నర్సు లోనికి వెళ్ళింది.

పెదబాబు ఒక్కక్షణం మాట్లాడలేదు. కానేపాగి 'ఈ వాన కురిసిన రాత్రి మీకేమి గుర్తుకు తెస్తున్నది?' అన్నారు.

'ఏమీ గుర్తుకుతేవడం లేదండీ. అయ్యో, ఇవ్వాళ హైదరాబాదు వెళ్ళలేక పోయాను కదా అన్న విషయం గుర్తుకుతెస్తున్నది' అన్నాను

పక్కున నవ్వాడు పెదబాబు

తియ్యగా నవ్వారు. నవ్వినప్పుడు బుగ్గలు సొట్టలుపడ్డాయి. అంతలోకే తీవ్రంగా మారిపోయారు . ఏదో లోకంలోకి చూస్తూ అన్నారు.

'నాకు ఒక మధుర సంఘటన జ్ఞాపకానికి తెస్తున్నది. అప్పుడు నాకూ రమకూ పెండ్లికాలేదు. మా ప్రణయంలో తొలిదినాలు. ఆనాడు రమవాళ్ళ అమ్మ, నాన్న ఊళ్ళోలేరు. ఏదో తీర్థయాత్రలు వెళ్ళారు. నేనూ రమా వాళ్ళ ఇంట్లో కూర్చున్నాము. బయట వాతావరణం ఉరుముతూన్నది. రమ నన్ను ప్రశ్నించింది 'ఇప్పుడు ఇంటికి వెళ్ళి ఏంచేస్తారు?' అని.

'ఏంలేదు - నిన్ను తలుచుకుంటూ కూర్చుంటాను' అన్నాను.

తమాషాగా నవ్వింది. తాను గీసిన ఒక బొమ్మ చూపి 'ఎలా ఉంది?'అని అడిగింది. 'బాగుంది' అన్నాను ముక్తసరిగా.

వాళ్ళ అత్తమ్మ ఒకామె ఉంది ఇంట్లో. ఉప్మాచేసి తెచ్చి ఇచ్చింది. కొంచెం ఉప్పు ఎక్కువయింది. ఆమాటే అన్నాను. నవ్వి 'చేసింది నేనుకాదు' అన్నది రమ. 'నీకు వంట బాగా చేతనవునా?' అన్నాను.

'ఓ ఎక్స్‌పర్టును. మీకేం ఇష్టం?' అన్నది.

'వంకాయ.'

'ఓహో! బ్రింజాల్స్ నాకూ ఇష్టమే' అన్నది.

'ఇంకేం రుచులూ, అభిరుచులూ కలిశాయన్నమాట' అన్నాను.

రమ నవ్వింది.

'రమా!' లేచిరమ్మని అత్త కేక.

'ఇంక వెళ్ళండి.'

'ఉహూ వెళ్ళను.'

'ఏం?'

'ఇలాగే చూస్తూ కూర్చుంటాను.'

'ఎందాకా?'

'తెల్లవార్లూ'

'ఇవ్వాళ శివరాత్రి కాదు వెళ్ళండి'

లేచి వాకిట్లోకి వచ్చాను. సాగనంపింది.

బాగా గుర్తుంది నాకు.

ఆనాడు సోమవారం. రాత్రి తొమ్మిదిన్నర.

బయలుదేరిన వెంటనే భోరున ఇలాంటి వర్షమే.

అచ్చంగా ఇలాగే కురిసింది ... అప్పుడు ...

పెదబాబు ముఖంలో రంగులు మారిపోయాయి . చెపుతున్నవారల్లా ఆగిపోయి పెద్దగా 'రమా' 'రమా' అని కేకవేశారు

నర్స్ పరుగెత్తుకుంటూ వచ్చింది.

'ఏమయింది?' అన్నది.

'ఏమీలేదు - రమ ఏంచేస్తున్నది?'

'మందు తాగింది.'

'ఉహూ.' కొంచెం ఊరటపొంది నిటూర్పు విడిచారు.

'శైలజ?'

'పడుకున్నది.'

'అన్నం పెట్టావా?'

'ఆఁ.'

'నేను వచ్చి నిద్రపుచ్చనా?'

'అక్కర్లేదండీ, నేనున్నానుగా.'

ఆయనలో ఆవేశం తగ్గింది.... ముఖం ప్రశాంతంగా మారింది.

"శైలజను రమ ఏమని పిలుస్తుందో తెలుసా రమణరావుగారూ?"

"లేదండి."

"సుమ అని పిలుస్తుంది ...' అని నవ్వారు

"భోజనానికి లేవండి' అన్నది నర్స్.

ఇద్దరం లేచాము. పెదబాబు ముఖం, కాళ్ళు చేతులూ కడుక్కొని డైనింగ్ టేబిల్ ముందు కూర్చున్నారు. నేను ఎదురుగా కూర్చున్నాను.

"అదృష్టవంతుణ్ణి. ఇవ్వాళ మీతో కలిసి తింటున్నాను. మీ ఆతిథ్యం నిజంగా అనుకోని అదృష్టం'' అన్నాను ఆప్యాయతతో.

'నో-నో. అని నే ననవలసిన మాటలు. నర్స్, వడ్డించు' అన్నారు పెదబాబు.

ఆమె వడ్డించింది.

ఇద్దరమూ తృప్తిగా భోంచేశాము.

'శైలజ వయస్సు ఎంత?' అన్నాను నేను.

నర్స్ నావైపు కోపంగా చూచింది. ఎందుకో అర్థం కాలేదు.

'రెండేళ్ళు'అన్నారు పెదబాబు. 'చూపిస్తాను రండి' అని లేచారు వెంటనే.

'భోజనం అయ్యాక చూడవచ్చు' అన్నాను నేను.

పెదబాబు క్రమంగా శైలజను ఎలా పెంచాలో, ఎలా పెద్దదాన్ని చేయాలో చెప్పుకుపోతున్నారు. భోజనం ముగిసింది. ఇరువురం చేతులు కడుక్కున్నాము.

'నర్స్, శైలజను చూస్తాము మేము' అన్నారు పెదబాబు.

'ఇప్పుడే నిద్రపోయింది పెదబాబూ మీరు వెళితే తిరిగి లేస్తుంది. ఇక మళ్ళీ నిద్రపుచ్చడం కష్టం.'

'పోనీలెండి' అన్నాను నేను.

పెదబాబు నాకు విశ్రమించడానికి మంచం చూపారు.

పడుకొని నిద్రపోయాను.

తెల్లవారుజామున పెదబాబు పిలుపులతో మెలుకువ వచ్చింది.

'లేవండి ఫ్రెండ్' అన్నారు.

కళ్లు నులుముకుంటూ లేచి కూర్చున్నాను.

'మా నౌకరు చెప్పాడు. కాలవ తీసింది. మళ్ళీ వర్షం వచ్చేలాగుంది అర్జంటు ప్రయాణమయితే వెంటనే దాటండి' అన్నారు.

'అవునండి, అర్థంటే!' అన్నాను.

కోడికూత వినపడింది.

'రాజయ్యా!'

'చిత్తంబాబూ!'

'ఈయనను భద్రంగా ఏరు దాటించు.'

'చిత్తం. రండయ్యగోరు.'

పెదబాబు మళ్ళీ అన్నారు! 'రమణరావుగారూ, మీరు ఓ రెండురోజులు ఉండకూడదా?'

'క్షమించండి పెదబాబూ! అత్యవసరంగా వెళ్ళాలి. మరొకసారి వస్తాను.'

'మంచిది. మీ అడ్రసు ఇవ్వండి.'

ఇచ్చాను.

ప్రేమతో పెదబాబు వీడ్కోలు చెప్పారు.

నేనూ ఆప్యాయంగా మధురస్మృతులను గుండెలో నింపుకొని మెట్లు దిగాను.

రాజయ్య నన్ను వెంబడించాడు.

గేటుదాటి భవనంవైపు చూచాను.

అంచులవెంట నీళ్లు కారుతూ భవనం మూగగా నిలబడి ఉంది.

పెదబాబు మేడమీద సరిగ్గా అదే స్తంభానికి ఆనుకొని ఉన్నారు.

వారిని చూస్తుంటే ఎందుకో గుండె గుబగుబలాడింది. తిరిగి వెనక్కి వెళ్ళాలని తాపత్రయం. కాని వెళ్ళలేకపోయాను కర్తవ్యం గుర్తుకువచ్చి.

రాజయ్య వెంట వస్తున్నాడు.

"అమ్మగారికి ఏం జబ్బు రాజయ్యా?"

రాజయ్య బదులు పలకలేదు.

"ఏం రాజయ్యా!"

"చిత్తం. తమరు చీకట్లోనే వెళ్లుతారా బాబూ ఇప్పుడు." మాట మారుస్తున్నాడు రాజయ్య.

"ఔను, తప్పదు రాజయ్యా." కొంచెం ఆగి మళ్ళీ అన్నాను "బాబుగారు దేవుడులాంటి వాడయ్యా" అని.

ఆ మాట అనగానే రాజయ్య వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

"రాజయ్యా, రాజయా, ఏమిటిది?" అయోమయంలో పడ్డాను-

కాలవ వచ్చింది. నీళ్ళు బాగా తీశాయి. బళ్ళు అటూ ఇటూ ప్రయాణం చేస్తున్నాయి.

'దాటండి బాబూ' అన్నాడు రాజయ్య.

'రాజయ్యా-'

'ఏమిటి బాబూ?'

'అమ్మగారికి ఏమిటి రోగం?'

'మాయరోగం, ఏదో ఒకటి. తమరు వెళ్ళండి బాబూ.' రాజయ్యకు ఎందుకు కోపం వచ్చిందో తెలియలేదు.

ఇక మారు మాట్లాడకుండా ఏరు దాటాను.

ఒక ఎద్దులబండి వెళ్లుతున్నది పట్నంవైపు.

బండివాణ్ణి అడిగి దానిమీద కూర్చున్నాను.

మరో ఇరవై నిమిషాలలో పట్నం చేరాను.

మరునాడు ఉదయం ట్రైనుకే హైదరాబాదు బయలుదేరాను.

x x x x

హైదరాబాదు వెళ్ళాక నా కృతజ్ఞతలు తెలుపుతూ బాబుగారికి ఒక లేఖ వ్రాశాను. దానికి జవాబుగా పెదబాబు ఒక ఉత్తరం వ్రాశారు. అందులో విద్యానగర్‌లో కట్టవలసిన ఇంటినిగూర్చి, తననుగూర్చి, శైలజనుగూర్చి చాలా వ్రాశారు.

శైలజ మరీ అల్లరిచేస్తున్నది. నేనూ హైదరాబాదులో స్థిరపడాలనీ, దీనిని అక్కడ కాన్వెంటులో చేర్పించాలనీ నా కోరిక, అనీ వ్రాశారు. మరికొన్నాళ్ళకి శైలజను భవానీ శంకరం అనే అతనికిచ్చి వివాహం చేయాలని ఆలోచిస్తున్నట్లు వ్రాశారు.

ఆ తరవాత నేను నా గొడవలలో పడి పెదబాబుగారికి లేఖలు వ్రాయలేదు.

ఇంతలో నేను రీసెర్చి నిమిత్తం విదేశాలకు వెళ్ళాను.

రెండేండ్ల అనంతరం తిరిగి వచ్చాను.

వచ్చాక తిరిగి ఒకనాడు పట్నం బయలుదేరి వెళ్ళాను.

పట్నంలో మామయ్యగారి ఇంట్లోనే దిగాను.

మామయ్య పెద్దకుమార్తె నీళ్ళాడటానికి వచ్చింది.

హాస్పిటల్లో చేర్చారు. చూడటానికి హాస్పిటల్‌కి వెళ్ళాను. అక్కడ ఎవరో ఒక నర్సుతో ఒకామె మాట్లాడుతూఉంది.

నేనామెను తేలికగానే పోల్చుకున్నా.

ఆమె నర్సు. పెదబాబుగారింట్లోని నర్సు!

ఆమె నావైపు చూచింది. గుర్తించినట్లు ఆమె కన్నులే చెబుతున్నాయి. నేను దగ్గరికివెళ్ళి విష్‌చేశాను.

ఆమెకూడా చిరునవ్వుతో నన్ను ప్రశ్నించింది.

నేను క్లుప్తంగా వివరాలు చెప్పి పెదబాబుగారిని గూర్చి ప్రశ్నించాను.

వెంటనే ఆమె రెండుకళ్ళల్లోను నీళ్లు నిండాయి.

"ఏమయింది?" అన్నాను తడబడుతూ.

"మీరు ఏ దేశంలో ఉన్నారు?" అన్నది వ్యంగ్యంగా.

'నిజంగానే నండీ, నే నీ దేశంలో లేను."

"అలా చెప్పండి-అన్నిపత్రికలలోనూ పడ్డదికదా బాబుగారి మరణవార్త.'

ఒక్క-క్షణం స్తంభించిపోయాను.

మే మిరుపురం మాట్లాడుకుంటూ ఉండటంవల్ల అవతల నర్స్ వెళ్ళిపోయింది.

"మీకు నిజంగానే ఏమీ తెలియదా?"

"అబ్బే! ఏమీ తెలియదే?' అన్నాను ఆశ్చర్యంగా.

"సరే. అయితే మా ఇంటికి రాగలరా?'

'అలాగే"

ఆమెను వెంబడించి వాళ్ళ ఇంటికి వెళ్ళాను.

కాఫీ ఇచ్చి కూర్చోబెట్టి అవీ ఇవీ మాట్లాడిన తరవాత లోనికి వెళ్ళి ఒకటి రెండు ఉత్తరాలు తెచ్చి ఇచ్చింది నాకు.

అవి రమ పెదబాబుగారికి వ్రాసినవి. ఒక ఉత్తరంలో ఉంది.

"విద్యానగర్‌లో మోడరన్ డిజైన్‌లో ఇల్లు కట్టండి ఒక చిన్న బేబీ చాలు మనకు. నాకు అబ్బాయిలు ఇష్టంలేదు. పాప కావాలి ఆ పాపకు శైలజ అని పేరు పెట్టి 'సుమ' అని ముద్దుగా పిలుచుకోవచ్చు-బాగుందా?"

"ఈ ఉత్తరాలు ..." అన్నాను చదవడం ఇష్టంలేక.

"పెదబాబుకు రమ వ్రాసినవి, రమణరావుగారూ."

"ఎప్పుడు? పెళ్ళి కాకముందా?"

"ఔను. రమకు మరొకరితో పెండ్లి కాకముందు!'

సంభించిపోయాను నేను.

'అదేమిటి?'

'ఔను రమణరావుగారూ, రమను బాబుగారు ప్రేమించారు. కాని రమ బాబుగారిని నమ్మించి మోసగించి మరొకరిని వివాహమాడింది. బాబుగారికి దానితో మానసికమైన అవ్యవస్థ సంభవించింది. నేను మెంటల్ హాస్పిటల్‌లో నర్స్‌ను, బాబుగారికి బంధువును కూడా, వారి మానసిక ప్రశాంతికోసం కాలవ వద్ద బంగళాలో ట్రీట్‌మెంటుకై తెచ్చాము. అదీ సంగతి.'

'మరి రమకు ఏం జబ్బు?'

"రమ అసలు లేనిదే అక్కడ! ఎవ్వరూ లేరు అక్కడ.'

'మరి ఆ రోజున....

'అంతా వట్టి నటన. అవన్నీ ఆయన ఊహలూ, జ్ఞాపకాలూ.'

'శైలజ?' భయంతో ప్రశ్నించాను.

'బాబుగారికి రమకూ పెండ్లే జరగలేదే. ఇక శైలజ ఎక్కడిది రమణ రావుగారూ?' అంటూ కథ ముగించింది నర్స్!